కథా నిలయం
54.29
శ్రీకాకుళం

# గేది

కర్రెప్పయ్యగారి సొట్టప్పేయ్యకి కానీ కర్సులేకుండా గేదిపడ్డ దొరికింది. వుత్తిగుత్తినే యెపుడికేనా గేది పడ్డల్దొరుకుతాతయేటి ? దొరకవు - అది సత్తివే. కాని సొట్టప్పేయ్యకి మాత్రం దొరికింది. అంటదెలా దొరికింది? అదో కత.

మరి మా పాపయ్యగారి నర్సునాయ్డునేడా ? అడిదంతా ఒ యిసిత్రం. ఆడిసాల్లో గొడ్డు సావకూడదని అడికో నియమం. అయితే మరాడి కాడబక్కల్సచ్చిపోనేదా అంటే అదియేరేసంగతి. మోనిరుడు గావాల ఆడి పారువాతి గేదె నడుస్తూ నడుస్తూ సతికిలబడి పోయి సచ్చిపోనేదా ? కరఁవంయెవు డికేనా వొస్తాది. అప్పుట్లో ఓపాలి యీ పంజాబీవోళ్ళ గేదిలు కొనుక్కోడానికి లోన్లిచ్చినారుగదా - అదిగప్పుడే నర్సునాయుడా పారువాతి గేదిని కొన్నాడు లోనుమీద. నర్సునాయుడుకి లోనేట్రా అని అడక్కు. కలిగినోడికే గవురమెంటు లోన్లు, బీదా బిక్కి కెప్పడేనా లోన్లు దొరికి సచ్చినాయేట్రా. అలాటి వెప్పుడూ నర్సునాయులాంటి అదుష్టవంతులకే దొరుకుతాయి. కరణం ఆడిపక్క. పంచాతీ పెసెంటాడిపక్క. సఁవితి పెసెంటు సోయన్న ఆడికీరకాడు - మరి నర్సునాయ్డుకి రాక పోతే లోను నీకూ నాకూ వొస్తాదేటి ! అదగలాగందుకున్న లోను డబ్బెట్టే పంజాబీవోల్లకాడ అగేదిని కొని అపిమానంగ పారువాతి అని పేరెట్నాడు. అయితే అమాయసావు యింతలోనే కమ్మికెలిపొచ్చింది. కోనారి గంగులుగాడు సెన్నోరెట్టుకోని సెపుతూనే వున్నాడు సుమా "నాయుడుబాబూ, అల్లగేదిలు మనమడకని మన్నవు" అని. యెప్పట్లాగ అయేల కూడ పొద్దుపొడిసేతప్పటికి పాలు తీసేసినారు. ఆ తరవాత కల్లంలకుప్పలకాడ కొగ్గీసినారు - గడ్డి కర్రల్నవుల్తాయని. గేదిలు ఆవులు మేస్తానే వున్నాయి. మరి పారువాతి గేది కుప్పొగ్గీసి యేదో పెద్దపన్పచ్చినట్లు సాలదుక్కుదరిజాగా నాలగడుగులేసి దబుక్కున సతికిలపడిపోనాది. నువ్వు సేను కల్లంలా యిమ్మ సేస్తన్నాన్నేనప్పుడు. ఏట్రా గేదిలా తిరగబడి పోనాదని నాన్నగ్గిరికెల్లి సూతును-నాలికెల్లబెట్టీసినాది. ఇంతలో నర్సునాయ్డు పరుగెత్తు కొచ్చినాడు - బేగెల్లి ఏతముసిలిగాడ్ని కేకేసుకు రమ్మని గుంటడ్ని తోల్నాడు. పెద్దోడి ముంగట్లాపతకదయ్యా నల్గురు సుట్టూసేరి తలో మాతంతన్నారు- నర్సునాయ్డు మేర్బానీకోసం. "సంచకావోఁలయ్యా" అని కొంతమంది "సిల్లంగెట్టినారు కాబోఁలయ్యా" అని మరికొంతమంది " ఏనాకొడుకేనా కుడితిలో ముందెట్టీసినాడేట్రా " అని కొంతమంది యిలాతలోమాట. పాపం నర్సునాయ్డుమాతరం నోరుపడిపోయినాడ్లాగ నిలబడిపోన్డు.

ఇంతల ఏత ముసిలిగాడు పారొచ్చినాడు. గొడ్డుకీ గొర్రికి యెటొచ్చినా ఆడేమాకు వొయిజ్జెం. మరప్పట్లో మాకీ బక్కలాసుపత్రి రానేదుకదా ! అయితే ఏత ముసిలిగాడు మాత్రం నీలాంటి నాలాంటోడనుకున్నావేటి ? ఆడి కున్న నిదానం, నింపాది యీ పట్టంవ్ డాట్టర్లకుంటాదేటి ? ఈల్లు సూటూ బూట్లూ యేస్కురావడం వొచ్చినకాడ్నుండి వొయిజ్జెం పేరుతో యింజేసన్లో యింజేసన్లో అని ఒకటేగోల - అవతల గొడ్డుకి సూస్తె ఒల్లల్లా బొక్కలే ! అయితే సూసినావా- ముసిలిగాడొచ్చినాడని సెప్పినాను గదా - ఒస్తూనే జాకర్తగ సూసినాడు- ఆతరవాత శానాతంటాలు పడ్డాడనుకో. గొడ్డుకి గొంతక సాగదీసి ఏయే పసర్లే పోసినాడో- అయేటో అకూ దుంపా నూరి ముద్దల్తిని పించినాడో - అదంతా సూసినోడికే తెలుస్తాది. రాత్తిరాత్తిరల్లా పాపం గొడ్డుకాడే తొంగోయున్నాడు. తెల్లారిపూరాగ గొడ్డు సచ్చిపోనాదని అనుకున్నాగ్గానని ఆడు అడుగవతలకేసినాడేటి ! ఇంతకి సెప్పొంచిందే టంటే నర్సునాయ్డు ముంగట్ల గొడ్డు సావనేదనికాదు-సచ్చింది. అయితే ఆడికిసేతనయినంత సేపు ఆడి సాల్లోగొడ్డు సావనానికిల్లే దని అడి మతం.

అయితె యీ గేది పోనానికి సొట్టప్పియ్యి గాడికి గేదిపడ్డ దొరకనానికి యేటి సంవందంవంటావు. బొత్తిగా పారువాతి గేది నాగ కాదుకాని యీ గేదిపడ్డ కూడా సావనానికి తయారయిపోందనుకో. మరి యీ పాలి నర్సునాయ్డు ఏటి సేసినాడెరికా? నలుగురు కంబార్లు ముంగట్లా వున్న టైపు సూస్కోని యెవుడిక్కావలంటే ఆడు తోలుకెల్లిపొంద్రా పడ్డని అన్నాడు. కాని సావనానికి తయారైపోయి కూకున్న పెయ్యిని యెవుడు తోలికెల్తాడు? మాకేలంటే మాకేలని ఒక్కోడు జారిపోన్డు. మరీ సొట్టప్పియ్యిగాడి కక్కూర్తో బరోసావో యేటో తెల్దుగాని-తలగుడ్డ పెయ్యిమెడకి సుట్టి యింటి కీడ్సికెల్లిపోన్డు. "సీ యీడి కక్కూరితి సంతకెల్లా" అని మిగిలిన కంబార్లు వుమ్మకపోనేదు.

అయితే అడెందుకలా కక్కూరితి పడి పోన్డంటే అడిబాదలాడి కున్నాయి. ఈ మద్దినే నాతో సెప్పిగోలెట్టినాడు గనకనాకు తెలిసొచ్చినందిగాని కడంవోళ్ళంతా ఆడ్ని కక్కూరితి ముండా కొడుకనేకదా అనుకునీవోరు. ఆడికుటంవం సంగతి నీకు తెల్దేటి ? ఆడి కిద్దరు గుంటలున్నారు. ఆ యిద్దరు గుంటలు ఆడిపెళ్ళాం ఆళ్ళనిసూస్తే నీకేటనిపిస్తాదెరికా ? ఈల్లు మడుసులేనా, కొంపదీసి దెయ్యప్పిల్లలా అని పిస్తాది. అలగనుకోడం దరంవే ! ఒంట్లో సితకల్తప్ప, రగతంగాని మాంవసంగాని అల్లకున్నాయేటి ! నిత్తెం యీసురోంవంటుండారుగదా-అల్లనెలా మడుసులనుకోడంరా ?ఇంతకీ అది సొట్టప్పియ్యిగాడదుష్టం. లోగడ మా వూరి ముసలమ్మే ఓకత సెపుతుండేదిలే - గొడ్డూ గేదే మాయమ్మన్నకే, గుడ్డి పెల్లాం మాయమ్మన్నకే, గూనికొడుకూ మాయమ్మన్నకే అని. అలాగుండేదీ సొట్టప్పియ్యిగాడ దుష్టం కూడా. పేణాలు పోడం యిప్పడా మరో సిటంవ్కా అన్నట్లు పెల్లాం పిల్లలూ, నచ్చున్నర బొక్కల్తో గుడిసీ-దానికే జనమానా మాసికెయ్యడం నేదుకదా- ఇక ఆడి పొలం సంగతి

సరీసరి తుఁయ్యేడు గాని కొంపదీసి సరిగా వాన కురిసి నాలుగ్గింజలు పండిందో మరి నాలుగేళ్ళు సూడక్కన్నేదు. కొర్నుండి పోనాదన్నమాటే! అయిన్ప్ఁవచ్చరం నాడొచ్చినపంట కోఁవిటోడి వొడ్డీలకే సొల్లు. ఆడూ యిసిగి పోన్ను-ఎవుడు? సొట్టప్పిగోడు. ఇసిగిపోయేటి సేసిన్ను తెల్సా ? అపొరంబోకు మడి సెక్కల్ని పూరాగా అమ్మేసి అప్పుల్తీర్సిసినాడు. తను సాయాన్న యెలిపోయి నర్సు నాయడింట్లో కంబారిగా కుదిరిపోన్ను. నర్సునాయిడింట్లో వుడుకన్నం యెయ్యక పోయినాయేదో రెండుపూట్లింత అంబలెడతారుగదా-దప్పిక్కన్ని గెంజి నీల్లూ వుప్పుగడ్డా యేస్తారుగదా ! అదే అడికి పెద్ద సదుపాయం. ఆడింట్లో ఆడికేనాడేనయేళ్లు నోట్లో కెల్లినాయేటి ! మరయితే యీడి కొలువు యెల్లి పోతున్నది గాని పెల్లాం పిల్లల బుకిలి మాటేటి ?

ఎందుకంపనాగుండొచ్చుగాని ఆడి పెల్లాం నాటి ఆడ కూతుర్ని మరి సూడంరా ! మంచిదాయంటే- మరనకు- అంత మంచిదాయన్నమాట. దానదుష్టం అలా తగలడిపోయి ఆరోగ్గెం నేకంటా అయిపోనాదిగాని, దాని గునం మాత్తరం దేవుతులిగ్గునం అనుకో ! వున్న వొక్కమడకా పుత్తి గొడ్డుగేది నాటిదనీ తెలుసు- మెగుడుత్త మెతకనా కొడుకనీ తెలుసు- పిల్లల్దిష్టిపిడతలూ, తన పేఁనాలు తీసీనానికి పుట్టి నోల్లనీ తెల్సు-అయినా ఒక్కనాడంటే ఒక్కనాడు నోరిప్పి యిదిగిలాగ అన్నమాట అనీదికాదురా ఆడకూతురు. మొగుణ్ణి తిట్టెరుగదు. పిల్లలొంటిమీద సెయ్యే సెరగదు. యిదిగినాగ నాకష్టిఁవిది అని సెప్పెరగదు. మూగ్గొడ్డులా అనాగే పడిసచ్చీదిగాని మరో నాగుంటేదేటి! అల్లాడి కల్లంల సాళ్ళుబాగుసేసీసోల్లు గింజలు తెచ్చుగున్నట్టూ, యిల్లీడి పెరట్ల పిడకల్సేసి యిన్ని బియ్యపు గింజలు తెచ్చుకున్నట్టూ, అల్లాడి పెండి కాడ కంపిరిసి పొయ్యికిందికిన్ని సితుకులు తెచ్చుకున్నట్టూ యిదిగినాగే గడిపికొచ్చిందనుకోకాలం. తనేటి తినీదో పిల్లలికేటెట్టీదో అబగమంతుడికే తెలాల. మరి సొటప్పి గాడంతావా ఆడింటికి తెచ్చి పిల్లలికీ పిల్లానికి ఏటెట్టగల్డు?

అయితవన్నీ అలగుంచు - యీడు నర్సునాయ్డు కాడ్నుండి సావనానికి తయారుగున్న గేది పడ్డని యెందుకు తోలుకొచ్చినట్లు ? అయ్యేల సాయం కాలం సెరువుగట్టుకాడీడు తారసపడితే- ఓ పుగాకు సాయతుంపిచ్చినాను - దాంతో నిజెం బయటపడి పోనాది. ఆడేటి సెప్పేడంటే, " ఓరే దద్దా దాన్జాతకఁవుల సావాలనుందా బెమ్మ దేవుడ్రచ్చించనేడు- నేదు బతకాలన్రాసుందా రెండేళ్ల మేపేతప్పటికి గేద్దైకూకుంటాది. దద్దా! నాకున్న మడిసెక్కలూ మాన్నేలూ నీకేటి తెలవనీ ! గుంటలూ నా బారియా సస్తుఁవో అని యెనాగుంటారో నువ్వు సూడ్నేదేటి? అల్లకింత కూడెట్టలేక సస్తన్న నంజకొడుకుని, మరలాటప్పుడు నీకు గేదేర్లా అనంటావేటో - కానోరే దద్దా, గేదికి నానేటి పెద్ద పెద్ద మేపు ఎయ్య గలన్రా? అదిగనాగ అ పొలఁవంటా యీ పొలఁవంటా కసిన్ని గడ్డి పరకలు

మేస్తాది. అయినకిది బతికిన్నాటి మాట కదా- ఒట్టికెలిపోమని సెప్పిన్నరుస్సు నాయ్డు వొరిగెడ్డి పరకల్నాలుగియ్యడేటి నోరిడిసడిగితే? నా అదుష్టం బాగుండి అది బతికి జత కట్టిందంటే యేవో కసిన్ని పాలసుక్కలు గుంటల్తాగుతార రని ఆశ.నా బతుక్కి నేను గేదిని కొన గల్నేటి ? బగమంతుడు సల్లగా సూత్తే యీ సచ్చుపడ్డే నెగి సెత్తిరిల్లుతాది.

అదిరా సొట్టప్పిగాడాశ. బగమంతుడు కాంతలెక్క తిన్నగానే సూసినాడనుకో. పొలాల్లో దిగిపోయి మేసినా అనాదోడి గొడ్డని ఎవరూ బందెల్దొడ్లో ఏసీవోరు కాదు. మరొపాటోడి గొడ్డు ఎవుడిగడ్డి కుప్పేనా మేస్తంటే వూరుకుంటారేటి ? నడు(పు జారిపోవాలమల్లాలలాగేస్తారు బడిత్తో. మరీడి గేదె కుప్పలంటపడితే పొన్లే నాదారోడి గొడ్డని అదిలించొగ్గి సీవోరు. ఏడాదయినాక్కావాలోరె- ఆ పడ్డని సూత్తప్పటికి పెతీవోడికి సిన్న కన్నెర్ర నారంబ(వయిందనుకో. అరె నాన్తోలు కెల్లినాను కానంటే నాన్తోలు కెల్లినాను కానని నర్సునాయ్డు కంబార్లంతా కిరకిర్లాడ్డవే గదా ! వోరయ్యా ! జతకట్టినాక దాన్ని సూడా(ల - నిగ నిగలాడుతూ కొండగేది నాగ తయార యిందనుకో. అయితేట్నాబం-ఇంత మంచి గేది సొట్టప్పిగాడికి దక్కిందేటి ? ఈని కొడెపెయ్యేసిందా, నర్సునాయ్డు పలకర్ర నవుల్తూ సెరువికేసెల్తు న్నట్టెల్లి సొట్టప్పిగాడి సాల్లోదూరి గేదెన్నూసినాడు. సరిగ్గదేటయి(వుకి సొట్టప్పిగాడు పాల్తీస్తన్నాడు. "ఏట్రప్పిగా రెండడ్లిస్తన్నాదేటి ?" అనిఅడగేసినాడు నర్సునాయుడుండబట్టనేక. "ఏదో, బాబూ, మీ సలవ" అని నంగిరోడిసినాడీ నా కొడుకు. అంతే ! నర్సునాయ్డు యింటికెల్లి పోన్డు.

ఇజ్జరిగిన మన్నాడో మూడోనాడో " అప్పిగా, గేదిని మాసాలకే తోలీరా,పిల్ల పురిటికొచ్చింది బొత్తిగ పాల్నేకండయి పోనాయి." అని నర్సునాయ్డు సెలవిచ్చినాడు. రామరామ ! అప్పిగాడెలాగై పోన్డంటావ్ ఆ మాట్లిని? నీరైపోన్డు " బాబ్బాయి ! మాగుంటలేదో నా(ర్లోలు పాలసుక్కల్తాగుతా(వని ఆశపడతన్నారు "అనినసిగినాడప్పటికీ. "తాగుతార్లేరా ! మరీతల్లేవా ? యిక్కడికీతలైపోనావా! అనాగే తాగుదుర్లే! యీ పాలికి పిల్ల సరిగ్గా పురిటికి తయారయింది. నెగు ! నెగు ! ఎల్లిగేదిన్తోలు కురా" అని సొట్టప్పిగాడ్ని తగిలీసినాడు. అదిరా యీ గేది కత.

(అక్టోబర్ -1977- వీచిక)

✪✪✪